# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 9 జూన్ 2025 | పేజీలు 8


## మృగశిర కార్తె.. కిటకిటలాడిన చేపల మార్కెట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** మృగశిర కార్తె కావడంతో నగరంలోని రాంనగర్ చేపల మార్కెట్ కిటకిటలాడింది. ఉదయం నుంచే కొనుగోలుదారులు మార్కెట్‌కు చేరుకోవడంతో రద్దీ నెలకొంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని చేపల మార్కెట్‌కూ కొనుగోలుదారులు పోటెత్తారు.

# మా బాధను అధిష్ఠానానికి చెప్పే అవకాశం ఇవ్వాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** పదేళ్లు భారాసతో కొట్లాడమని, కాంగ్రెస్‌ను కాపాడింది తామేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆయన మంత్రిపదవి ఆశించి భంగపడిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ పెద్దలు బుజ్జగించారు. అనంతరం మల్‌రెడ్డి రంగారెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ లైన్‌లోనే ఉంటామన్న ఆయన.. పది ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులివ్వాలని డిమాండ్ చేశారు.“మా మొర అధిష్ఠానం వినలేదు. పార్టీలో కొత్తవాళ్లకు పదవులిస్తే.. కార్యకర్తలు బాధపడతారు. పార్టీకి ఇబ్బందికర పరిస్థితి వస్తోంది. ఇచ్చిన జిల్లాలకే రెండు, మూడు మంత్రి పదువులు ఇస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు గతంలో ఆరుగురు మంత్రులుండేవారు. మా బాధను అధిష్ఠానానికి చెప్పే అవకాశం పీసీసీ చీఫ్ ఇవ్వాలి. నా సామాజికవర్గమే అడ్డొస్తే.. పార్టీ కోసం పదవి త్యాగం చేస్తాం”అని రంగారెడ్డి అన్నారు.

# అఖిల్-జైనాబ్ పెళ్లి రిసెప్షన్ కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి కొనసాగుతోంది. యువ కథానాయకుడు అక్కినేని అఖిల్, జైనాబ్‌ల వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు హాజరై అఖిల్, జైనాబ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబు తన అర్ధాంగి నమ్రతతో కలిసి విచ్చేయగా, తమిళ స్టార్ హీరో సూర్య, యువ దర్శకుడు వెంకీ అట్లూరి తదితరులు

-2 లో

- అన్నపూర్ణ స్టూడియోస్‌లో అఖిల్, జైనాబ్ వివాహ విందు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రిసెప్షన్ ఫోటోలు
- జూన్ 6న అఖిల్, జైనాబ్ వివాహం
- వేడుకకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, వెంకయ్యనాయుడు
- వధూవరులను ఆశీర్వదించిన మహేశ్ బాబు, సూర్య
- పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖుల రాక

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ



**హైదరాబాద్ పెన్ పవర్:**నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బత్తిని కుటుంబం చేపప్రసాదం అందజేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, ఆస్తమాతో బాధపడుతున్న వారు ఇక్కడికి వచ్చారు. 13 కౌంటర్ల ద్వారా బత్తిని కుటుంబం చేపప్రసాదం పంపిణీ చేస్తోంది. ఇక్కడికి వచ్చిన వారి కోసం 42 క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. 2 రోజుల పాటు బత్తిని కుటుంబం పంపిణీ చేయనుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 70 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు పంపిణీని పరిశీలించారు



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) కన్నుమూత
- గుండెపోటుతో మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిక
- నివాళులర్పిస్తూ భావోద్వేగాలకు గురైన మాజీ సీఎం కేసీఆర్

# మాగంటి గోపీనాథ్ భౌతికకాయం వద్ద కేసీఆర్ కంటతడి

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యే, జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ (62) ఆదివారం కన్నుమూశారు. మూడు రోజుల క్రితం తీవ్రమైన గుండెపోటుకు గురైన ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, ఇటీవలే శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారని తెలిసింది. గోపీనాథ్ మరణవార్త తెలియగానే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీలో ఉన్న గోపీనాథ్ నివాసానికి చేరుకున్న కేసీఆర్, ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

-2 లో

# మహా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం.. ఆ కుటుంబం మళ్లీ కలిసేందుకు ముహూర్తం ఫిక్స్..?

మహారాష్ట్రలో కుటుంబ రాజకీయాలు ఎంత బలంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా థాక్రే ఫ్యామిలీ, పవార్ ఫ్యామిలీ దశాబ్దాలు మహారాష్ట్రలో చక్రం తిప్పుతున్నాయి. అక్కడ వీళ్లను కాదని ఏ పార్టీ సొంతంగా అధికారం చేపట్టే పరిస్థితి లేదంటే ఈ కుటుంబాలు ఎంత ప్రభావితం చేస్తాయో ఊహించవచ్చు.

బాల్ థాక్రే రాజకీయ వారసులుగా అరంగేట్రం చేసిన రాజ్ థాక్రే, ఉద్ధవ్ థాక్రే కొన్నాళ్ల తర్వాత విడిపోయారు. కుటుంబ సభ్యులు రాజకీయ ప్రత్యర్థులు అయ్యారు. ఇలా వేర్వేరుగా ఉండటం వలన రాజకీయంగా నష్టపోవడమే తప్ప ఎవరికీ లాభం లేదని.. ఈ ఫ్యామిలీ మళ్లీ కలవాలనే లోచనలో ఉందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఇప్పుడు అలాంటి వార్తలే మరో ఫ్యామిలీ గురించి వస్తున్నాయి. మహారాష్ట్రలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన శరద్ పవార్ ఫ్యామిలీ ఈ మధ్య రెండు గ్రూపులుగా విడిపోయింది. అజిత్ పవార్ సొంత కుంపటి పెట్టుకుని ఎన్డీఏలో కలిసి అధికారం అనుభవిస్తున్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 26 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఇరు పార్టీలు కలిసే అవకాశం ఉందని మహారాష్ట్రలో చర్చ నడుస్తోంది.



అజిత్ పవార్ (ఎన్సీపీ) వర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్సీ, అమోల్ మిట్కారి ఈ చర్చకు మరింత ఆజ్యం పోశారు. "దేవుని దయ ఉంటే అజిత్ పవార్, సుప్రియా సూలే ఏకాదశి (జులై 6) లోపు కలిసిపోతారు" అని కామెంట్ చేశారు. అయితే ఈ ఊహాగానాలు ఇప్పుడే కొత్తేం కాదు. ఏకంగా పార్టీ చీఫ్ శరద్ పవార్ కూడా గతంలో ఈ అంశంపై మాట్లాడారు. "పార్టీలో రెండు అభిప్రాయాలు ఉన్నాయి. ఒకటి శరద్ పవార్ తో కలిసిపోవడం. రెండవది.. బీజేపీతో ప్రత్యక్షంగా పరోక్షంగా కలవకపోవటం" అని అన్నారు. అయితే ఫైనల్ గా నిర్ణయం తీసుకునేది తన కూతురు సుప్రియా సూలే అని అనటంతో ఇరు వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి. అయితే దీనిపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు . ఈ విషయంలో అఫీషియల్ ప్రపోజల్ వస్తే ఆలోచిస్తానని అన్నారు. ఒకవేళ ఈ రెండు వర్గాలు మళ్లీ కలిసిపోతే మహారాష్ట్ర రాజకీయ స్వరూపం మారిపోతుందని విశ్లేషకులు అంటున్నారు.

**రెండు కుటుంబాలు.. రెండ్రెండు గ్రూపులు:**

మహారాష్ట్ర రాజకీయాల్లో థాక్రే కుటుంబం, పవార్ కుటుంబం సుదీర్ఘ కాలంగా శాసిస్తూ వస్తున్నాయి. బాల్ థాక్రే వారసుల మధ్య వచ్చిన విభేదాలతో రాజ్ థాక్రే 'మహారాష్ట్ర నవ నిర్మాణ సేన' (%వీచీూ%) స్థాపించారు. అదే సమయంలో ఉద్ధవ్ థాక్రే తన తండ్రి బాల్ థాక్రే స్థాపించిన 'శివసేన'కు సారథ్యం వహిస్తూ వస్తున్నారు. వీరు వేర్వేరు ప్రత్యర్థులుగా ఉండగా.. థాక్రే కుటుంబానికి నమ్మిన బంటుగా ఉన్న షిండే.. శివసేనను చీల్చి ఎన్డీఏ అలయన్స్ తో అధికారం అనుభవించారు. శివసేన పార్టీ ఎవరిదనే అంశంపై కూడా చాలా వివాదం జరిగింది. అసలైన వారసులం మేమేనని షిండే ప్రకటించే వరకు వెళ్లింది. దీంతో ఉద్ధవ్ థాక్రే శివసేన అటు బీజేపీతో పాటు షిండేతో కూడా రాజకీయ యుద్ధం చేయాల్సి వస్తోంది.

థాక్రే వారసులు వేర్వేరుగా ఉండటం వలన.. బాల్ థాక్రే లెగసీని ఆ కుటుంబానికి సంబంధం లేని ఏక్ నాథ్ షిండే అనుభవిస్తున్నాడనే భావన థాక్రే వారసుల్లో ఉంది. శివసేనను చీల్చి ముఖ్యమంత్రి పదవి అనుభవించడం.. థాక్రే కుటుంబాన్ని టార్గెట్ చేయడంపై ఆ కుటుంబం సీరియస్ గా ఉంది. వేర్వేరుగా ఉండేకంటే కలిసిపోయి థాక్రే లెగసీని కొనసాగించాలని.. శివసేనను స్వాధీనం చేసుకోవచ్చుననే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రాజ్ థాక్రే, ఉద్ధవ్ థాక్రే కలిసి పోతారనే ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే శివసేనను చీల్చి అధికార పార్టీలో చేరిపోయిన ఏక్ నాథ్ షిండే కు పెద్ద ఛాలెంజింగ్ పరిణామమనే చెప్పుకోవచ్చు. అదే విధంగా వచ్చే ఎన్నికల్లో అధికార కూటమికి కూడా సవాలుగానే మారే అవకాశం ఉంది. ఇదే సమయంలో పవార్ కుటుంబం కూడా ఒక్కటయ్యే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. అయితే థాక్రే ఫ్యామిలీ కలిసి పోవడంలో ఎలాంటి సమస్య లేదు. ఎందుకంటే ఎవరూ అధికారంలోగానీ, అధికార పార్టీలో గానీ లేరు. కానీ పవార్ కుటుంబం కలవడంలోనే కాస్త ఇబ్బంది కర పరిస్థితులు అయితే కినిపిస్తున్నాయి. ఎందుకంటే అజిత్ పవార్ ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నారు. అందులోనూ ఉపముఖ్యమంత్రిగా కీలక పదవిలో ఉన్నారు. ఒకవేళ కలిస్తే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గానీ బీజేపీతో కలిసేది లేదని ఇప్పటికే శరద్ పవార్ ప్రకటించారు. ఇలాంటి పరిస్థితుల్లో అజిత్ పవార్ ఎన్డీఏను వీడి ప్రతిపక్షంలో ఉన్న శరద్ పవార్ తో చేరుతారా అనేదే అసలైన ప్రశ్న.

2023 లో ఎన్సీపీని చీల్చి మెజారిటీ ఎమ్మెల్యేలతో అధికారంలో ఉన్న బీజేపీ–శివసేన తో చేరిపోయారు అజిత్ పవార్. ఉపముఖ్య మంత్రి పదవిని పొందారు. ఆ తర్వాత 2024 ఎన్నికల్లో మళ్లీ బీజేపీ అధ్యవర్యంలోని మహాయుతి అధికారాన్ని నిలబెట్టుకుంది. దేవేంద్ర ఫడ్నవీస్ కేబినెట్ లో కీలక మంత్రిగా, రెండవ ఉపముఖ్యమంత్రిగా పదవిని పొందిన విషయం తెలిసిందే.

## అఖిల్-జైనాబ్ పెళ్లి రిసెప్షన్ కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

కూడా ఈ వేడుకలో పాలుపంచుకుని నవ దంపతులకు తమ ఆశీస్సులు అందించారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్–ఉపాసన, నాని, నిఖిల్, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు సానా తదితరులు కూడా విచ్చేశారు.

వీరితో పాటు మరికొంతమంది సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు ఈ వివాహ విందులో పాల్గొని సందడి చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రాంగణం ప్రముఖుల రాకతో కళకళలాడింది. అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా అఖిల్, జైనబ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ వేడుకకు సంబంధించిన కొన్ని ఆకర్షణీయమైన ఫోటోలను అన్నపూర్ణ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకోగా, అవి ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన, శుక్రవారం నాడు, అఖిల్, జైనాబ్‌ల వివాహం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నాగార్జున నివాసంలో నిరాడంబరంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహానంతరం ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, క్రీడా రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మాగంటి గోపీనాథ్ భౌతికకాయం వద్ద కేసీఆర్ కంటతడి

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులను ఓదార్చిన కేసీఆర్, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు, ఎంపీ రవిచంద్ర తదితరులు కూడా గోపీనాథ్‌కు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు, గోపీనాథ్ మృతి పట్ల కేసీఆర్ ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. హైదరాబాద్‌కు చేరుకున్న ప్రభాకర్‌రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం సిట్ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత ఏడాది మార్చి 10న ఆయనపై కేసు నమోదైంది. మరుసటి రోజే ప్రభాకర్‌రావు మూడు నెలల కాల పరిమితి వీసాపై అమెరికా వెళ్లి తిరిగి రాలేదు. తాజాగా అమెరికా నుంచి భారత్ వచ్చేందుకు అవసరమైన ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్(ఈసీ–అత్యవసర పత్రం) జారీ అయింది. దీంతో ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు.



## ముగిసిన మంత్రి వర్గ విస్తరణ




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ముగ్గురికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ముగ్గురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇద్దరు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి, ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు మంత్రివర్గంలో చోటు దక్కింది.

**మూడు సామాజికవర్గాలకు చెందిన...**

వీరిలో గడ్డం వివేక్ మాల సామాజికవర్గానికి చెందిన వారు కాగా, అడ్లూరి లక్ష్మణ్ మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు. ఇక వెనకబడిన తరగతులకు చెందిన అడ్లూరి లక్ష్మణ్ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కొత్త మంత్రులకు సంబంధించిన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. గడ్డం వివేక్ ఇంగ్లీష్ లోనూ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

## ముంబై వాసులను హడలెత్తించిన డ్రోన్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల పాకిస్థాన్ తో ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత్ లోని కొన్ని నగరాల్లో డ్రోన్లపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ముంబైలో కూడా డ్రోన్లపై ఆంక్షలు ఉన్నాయి. నగరంలో డ్రోన్లు (మానవరహిత వైమానిక వాహనాలు – యూఏవీలు) ఎగరవేయడంపై నిషేధం అమల్లో ఉన్నప్పటికీ, కందివలి ప్రాంతంలోని బందర్ పఖాడీలో శనివారం అర్ధరాత్రి ఓ డ్రోన్ సంచరించడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారని ఓ అధికారి ఆదివారం తెలిపారు.కందివలి పశ్చిమ ప్రాంతంలోని చార్‌కోప్ పోలీస్ స్టేషన్ అధికారులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. శనివారం అర్ధరాత్రి తమ ప్రాంతంలో డ్రోన్ ఎగురుతోందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే వారు రంగంలోకి దిగారు. "కొన్ని ఎత్తైన భవనాల్లోని అపార్ట్‌మెంట్ల పై అంతస్తుల్లో నివసించే వారి కిటికీల సమీపంలోకి డ్రోన్ రావడంతో నివాసితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు" అని సదరు అధికారి వివరించారు. కొన్ని నిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టి మాయమైన ఈ డ్రోన్‌ను నడిపిన ఆపరేటర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.కాగా, 'ఆపరేషన్ సింధూర్' ప్రారంభించిన తర్వాత ముంబైలో కఠినమైన డ్రోన్ నిబంధనలను అమలులోకి తెచ్చారు. భారతీయ పౌర భద్రతా నియమావళిలోని సెక్షన్ 163 కింద జూలై 4 వరకు యూఏవీలు మరియు ఇతర ఏరియల్ పరికరాల వినియోగంపై ముంబై పోలీసులు నిషేధ ఉత్తర్వులు జారీ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, విమానాలు, పారాగ్లైడర్లు మరియు పారామోటార్ల వినియోగాన్ని నిషేధించడానికి ఈ నిబంధనలు అనుమతిస్తాయి.ఇటీవలే, శుక్రవారం అంధేరీ తూర్పులోని సీప్జ్ ప్రాంతంలో ఓ క్లయింట్ కోసం ప్రచార వీడియో చిత్రీకరించడానికి డ్రోన్ ఎగరవేసినందుకు ఓ రియల్టీ సంస్థకు చెందిన ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు.

# మంత్రిగా వివేక్ వెంకటస్వామి ప్రమాణ స్వీకారం.. తిరుమలలో మొక్కులు చెల్లించుకున్న అభిమానులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు తిరుమల అలిపిరి పాదాల మంటపం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి రావడంతో ఆయన అభిమానులు తిరుమల వెంకన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. 101 కొబ్బరికాయలు కొట్టి దళిత సంఘాల నేతలు, అభిమానులు పూజలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అభిమానులు స్వీట్స్ పంచుకున్నారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో వివేక్ వెంకటస్వామి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన అభిమానులు ఆకాంక్షించారు. నిరంతరం పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి వివేక్ వెంకట స్వామి కృషి చేశారని తెలిపారు. దళిత సంఘాల నేతలు మల్లారపు మధు, నాగేంద్ర, బాబురావు, శ్రీనివాసరావు, బాలకృష్ణ, హరిబాబు తదితరులు తిరుమలలో మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా.. వివేక్ వెంకటస్వామికి మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించినందుకు మాల విద్యార్థి సంఘాల నాయకులు స్వాగతించారు. ఈ మేరకు మాల విద్యార్థి నాయకుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామికి మంత్రి వర్గంలో చోటు కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాలలకు రానున్న రోజుల్లో కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని వారు కోరారు.

# అలా చేస్తే AI ని బీట్ చేయవచ్చు.. టెకీలకు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల సూచనలు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్ వేర్ రంగంలో సమూల మార్పులు తీసుకొస్తోంది. ఉద్యోగులు చేసే పనిని సగం ఏఐ చేస్తుండటం టెక్ ప్రొఫెషనల్స్ లో ఆందోళన కలిగించే అంశం. ఏఐ రాకతో ఇప్పటికే చాలా కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థలు లేఆఫ్స్ ను ప్రకటించాయి. ఈ పరిస్థితుల్లో ఏఐతో పోటీపడుతూ ఉద్యోగాలను కాపాడుకోవడం ఎలా అనే ప్రశ్న సాఫ్ట్ వేర్ ఉద్యోగుల్లో మొదలైంది. అదే క్రమంలో ఏఐ ని తట్టుకుని సాఫ్ట్ వేర్ రంగంలో నిలదొక్కుకోవడం ఎలా అనే ఆందోళనలు ఎక్కువవుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో కంప్యూటర్ స్టూడెంట్స్, సాఫ్ట్ వేర్ ప్రొఫెషనల్స్ కు కీలక సూచనలు చేశారు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల. సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీని ఏఐ మార్చివేస్తున్న ఈ సమయంలో స్టూడెంట్స్ స్ట్రాంగ్ ఫండమెంటల్స్ నేర్చుకోవాలని సూచించారు. కోడింగ్ విషయంలో ఏఐ రోల్ పెరుగుతున్నప్పటికీ.. లాజికల్ గా ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడం, సిస్టమేటిక్ సొల్యూషన్ డిజైన్ చేయడం వంటి అంశాలకు డిమాండ్ ఎప్పటికీ ఉంటుందని నాదెళ్ల అన్నారు. ఏఐ సక్సెస్ అంతా ఇన్?స్ట్రక్షన్స్, ఇన్ పుట్ ఇవ్వడంపైనే ఆధారపడి ఉందని అన్నారు. సిస్టమ్ ఎలా ఆలోచిస్తుందో.. దాన్ని నడిపించే టెక్నికల్ నాలెడ్జ్ పెంచుకోవాలని సూచించారు.

యూట్యూబర్ సజ్జద్ ఖాడే పాడ్ కాస్ట్ లో పాల్గొన్న సత్య నాదెళ్ల భవిష్యత్తులో సాఫ్ట్ వేర్ ఉద్యోగాల సరళి గురించి చర్చించారు. "ఏఐ ప్రపంచంలో నేను ఒక బిగినర్ ను.. టెక్ రంగంలోకి రావాలనుకుంటున్నా.. మీ ముఖ్యమైన సలహా ఏంటో చెప్పగలరా.." అనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా రిప్లై ఇచ్చారు. "ఒక వేళ మీరు సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయితే.. సాఫ్ట్ వేర్ కు సంబధించిన ఫండమెంటల్స్ పై పట్టు సాధిస్తే.. అదే సరిపోతుంది" అని అన్నారు.

మైక్రోసాఫ్ట్ కు చెందిన కోడింగ్ ను దాదాపు 30 శాతం వరకు ఏఐ చేసిపెడుతుందని ఆ మధ్య ఫేస్ బుక్ సీఈవో మార్క్ జుకెర్ బర్గ్ తో సమావేశం సందర్భంగా సత్యనాదెళ్ల అన్నారు. దీనిపై స్పందిస్తూ.. 20 నుంచి 30 శాతం కోడింగ్ ఏఐ రాస్తుండవచ్చు.. కానీ మెజారిటీ వర్క్ అంతా సాఫ్ట్ వేర్ ద్వారానే జరుగుతుందని అన్నారు.

# వాడకం అంటే మనోళ్లదే.. చాట్ జీపీటీ తెగ వాడేస్తున్నారట




హైదరాబాద్ పెన్ పవర్:వాడకమంటే అలా ఇలా కాదు. వాడకానికి కూడా తెలీనంత బాగా వాడేయటం మనోళ్లకే చెల్లు అంటూ సరదాగా వ్యాఖ్యలు చేస్తుంటారు. కానీ.. ఏదైనా అంశం మీద ఫోకస్ పెట్టినా.. దాని కారణంగా ప్రయోజనం ఉంటుందన్న విషయంపై క్లారిటీ వచ్చినా.. దాన్ని వినియోగించే విషయంలో మనోళ్ల తర్వాతే ఎవరైనా. ఈ విషయం మరోసారి నిరూపితమైంది. రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన చాట్ జీపీటీని అత్యధికంగా వినియోగిస్తున్న వారిలో భారతీయులు ముందున్న విషయాన్ని తాజాగా విడుదలైన రిపోర్టు వెల్లడించింది.

2022 నవంబరు 30న చాట్ జీపీటీ ప్రపంచానికి పరిచయమైంది. అతి తక్కువ వ్యవధిలోనే దీన్ని వినియోగించే వారి సంఖ్య అంతకంతకూ ఎక్కువ అవుతోంది. చాట్ జీపీటీ వినియోగంలో భారత యూజర్లు 13.5 శాతం ఉన్నట్లుగా గుర్తించారు. అగ్రరాజ్యం అమెరికాను వెనక్కి నెట్టి సైతం భారత్ ముందు ఉండటం విశేషం. చాట్ జీపీటీ వినియోగదారుల సంఖ్య భారత్ లో 10.8 కోట్లకు చేరుకున్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చాట్ జీపీటీ వినియోగంలో భారత యూజర్లు 13.5 శాతం ఉంటే.. అమెరికా వాటా 8.9 శాతమే. ఇండోనేషియా 5.7 శాతం.. బ్రెజిల్ 5.4.. ఈజిప్టు 3.9.. మెక్సికో 3.5..పాకిస్తాన్ 3..జర్మనీ 3.. ఫ్రాన్స్ 2.9..వియత్నాం 2.6 శాతాలతో ఉన్నాయి.

అవసరం ఏదైనా చాట్ జీపీటీని వాడేస్తున్న భారతీయుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. చైనా తయారీ చేసిన ఏఐ చాట్ బాట్ డీప్ సీక్ వినియోగంలోనూ భారతీయులు మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ వినియోగదారుల్లో డీప్ సీక్ ను వినియోగించే వారు 6.9 శాతం మనోళ్లే. 33.9 శాతం వాటాతో చైనా ముందు ఉంటే.. 9.2 శాతంతో రష్యా రెండో స్థానంలో నిలిచింది. డీప్ సీక్ మొత్తం వినియోగదారులు 5.4 కోట్లు. ఇక.. చాట్ జీపీటీ తెలుగు.. హిందీ.. మలయాళం.. తమిళం వంటి భారతీయ భాషల్ని సపోర్టు చేస్తుంది. దీంతో.. తెలుగును వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ధరల్లో ఉండటం.. ఇంటర్నెట్ వేగం ఎక్కువగా ఉండటం కూడా చాట్ జీపీటీ వాడకం ఎక్కువగా ఉండటానికి కారణంగా చెబుతున్నారు. చాట్ జీపీటీ వేదికగా రోజుకు నమోదవుతున్న సెర్చ్ లు ఎన్నో తెలుసా? అక్షరాల 100 కోట్లకు పైనే. వార్షిక సెర్చస్ (వెతకటం) 36,500 కోట్లకు చేరుకోవటానికి గూగుల్ కు 11 ఏళ్ల సమయం తీసుకుంటే.. చాట్ జీపీటీ ఈ మైలురాయిని కేవలం రెండేళ్లలో అందుకోవటం గమనార్హం.

చాట్ జీపీటీకి అంతర్జాతీయంగా 80 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లు ఉన్నారని.. 21 నెలల క్రితంతో పోలిస్తే చాట్ జీపీటీ యాప్ లో మూడు రెట్లు ఎక్కువ సమయాన్ని యూజర్లు వెచ్చిస్తున్నట్లుగా గుర్తించారు. చాట్ జీపీటీ డబ్బులు చెల్లించే చందాదారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం పెయిడ్ సబ్ స్రైబర్ల సంఖ్య 2 కోట్లకు చేరింది. చాట్ జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐకు ప్రస్తుతం చందాదారుల రూపంలో భారీ ఆదాయం సమకూరుతోంది. చాట్ బాట్ ఒక్కటే కంపెనీకి ఏటా రూ.31,709 కోట్ల ఆదాయాన్ని అందించటం ఆసక్తికర అంశంగా చెప్పక తప్పదు.

# వైసీపీ లీడర్స్: అయినా.. సర్దుకుపోలేకపోతున్నారు ..!



హైదరాబాద్ పెన్ పవర్:వైసీపీ నాయకుల్లో సర్దుబాటుధోరణి కనిపించడం లేదా? ఇంకా మంకు పట్టుతోనే వ్యవహరిస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వస్తోంది. గత ఎన్నికలకు ముందు పార్టీ అధినేత జగన్ తమకు అన్యాయం చేశారని భావిస్తున్న నాయకులు.. కొందరు.. ఇప్పటికీ సర్దుబాటు ధోరణిలో కనిపించడం లేదు. నియోజక వర్గాలను మార్చడం..ద్వారా తమను డైల్యూట్ చేశారని.. చాలా మంది నాయకులు భావిస్తున్నారు. వీరిలో మహిళా మంత్రులు కూడా ఉన్నారు. వీరందరిదీ ఒక్కటే బాధ, ఆవేదన కూడా. అదే.. తమకు అన్యాయం చేశారని!.

నియోజకవర్గాల వారీగా నాయకులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు. వాస్తవానికి.. పార్టీతో ఇప్పుడు టచ్‌లో ఉన్నవారిని గమనిస్తే.. గత ఎన్నికల్లో మార్పులు జరగని నాయకులు మాత్రమే జగన్‌తో టచ్‌లో ఉన్నారు. ఇక, నియోజకవర్గాల మార్పు జరిగిన చోట నాయకులు, మాజీ మంత్రులు కూడా దూరంగానే ఉన్నారు. విజయవాడ లో వెల్లంపల్లి శ్రీనివాస్ మంత్రిగా పనిచేశారు. కానీ, ఆయనను నియోజకవర్గం మార్చారు.

ఇక, సెంట్రల్ ఎమ్మెల్యేగా 2019లో విజయం దక్కించుకున్న మల్లాది విష్ణుకు అసలు టికెట్ కూడా ఇవ్వ లేదు. వీరిద్దరూ కూడా పార్టీ కార్యక్రమాలకే కాదు.. పార్టీకి కూడా దూరంగానే ఉంటున్నారు. అదేవిధంగా ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తానేటి వనిత, కురుపాం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి ఇలా.. అందరూ కూడా.. దూరంగా నే ఉంటున్నారు. వీరిలో కొందరికి మాత్రమే నియోజకవర్గాలు మార్చారు.

కానీ.. పార్టీలో అంతర్గతకుమ్ములాటలు.. పార్టీ అధినేత వైఖరి.. వంటివివిధిని పార్టీకి దూరంగా ఉంచుతు న్నాయన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే ఎన్నికలు ముగిసి ఏడాది అయింది. అయినా.. నాయకుల్లో మాత్రం సర్దుకుపోయే లక్షణం కనిపించడం లేదు. దీనికి వారి వైపు నుంచి కారణం కనిపిస్తోంది. నియోజకవర్గానికి ఒక్కసారి దూరమైన తర్వాత.. మళ్లీ పుంజుకునేందుకు.. ప్రజలతో కలివిడిగా ఉండేందుకు కూడా.. ఇబ్బందిగానే ఉంది. ఈ నేపథ్యంలోనే చాలా మంది నాయకులు సర్దుకుపోలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

## ఆంధ్రకు అండగా కమల్ హాసన్.. ఏ విషయంలో అంటే..?



హైదరాబాద్ పెన్ పవర్:మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ ఇటీవల రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క భాషా వివాదంలోనూ చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన జాతీయ విద్యావిధానం (ఎన్.ఈ.పీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఈ విషయంలో తమిళనాడు సీఎం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. అవును... త్రిభాషా సూత్రం అమలుపై ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ హాసన్ స్పందించారు. ఇందులో భాగంగా... పాఠశాలల్లో ఒక నిర్దిష్టమైన భాషను విద్యార్థులపై బలవంతంగా రుద్దడం వల్ల అభ్యాస ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని కమల్ అన్నారు. ఈ విషయంలో తాను ఏపీకి అండగా నిలుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన కమల్ హాసన్... విద్య విషయంలో విద్యార్థులకు ఎలాంటి అడ్డంకులు సృష్టించకూడదని.. ఒక భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలి అంటే స్పానిష్, చైనీస్ ఏదైనా నేర్చుకోవచ్చని.. దేశంలో ఎన్నో ఏళ్లుగా ఇంగ్లిష్ విద్య స్థిరంగా కొనసాగుతోందని.. దాన్ని ఒక్కసారిగా భర్తీ చేయాలనుకుంటే ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కీలక ప్రశ్నలు సంధించారు. ఇందులో భాగంగా.. తమపై హిందీని బలవంతంగా రుద్దితే మా మాతృ భాష ఏమవ్వాలి.. దేశంలో ఉన్న 22 అధికారిక భాషల్లో తమిళం ఒకటి కాదా? అని కమల్ ప్రశ్నించారు. ఈ విషయంలో తమిళనాడు మాత్రమే కాకుండా.. పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లకు అండగా నిలుస్తానని అన్నారు.కాగా జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లిష్, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే.. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని తమిళనాడు అధికార డీఎంకే స్పష్టం చేసింది. ఈ విషయంలో స్టాలిన్ తీవ్రంగా రియాక్ట్ అవుతున్నారు.అయితే... ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలో ఉండటంతో ఆ విషయంలో కమల్ హాసన్ సహాయసహకారాల అవసరం అక్కడ ఉండకపోవచ్చని అంటున్నారు పరిశీలకులు!

## హైదరాబాద్ జీడిమెట్ల పరిధిలో విషాదం.. పాపం ఈ కుర్రాడు..



హైదరాబాద్ పెన్ పవర్:జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్?పై వెళుతున్న వినయ్(20) అనే యువకుడు పాండు బస్తీకి వెళ్లే టర్నింగ్ వద్ద అదుపు తప్పి లారీ వెనుక టైర్ల కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయాడు. లారీ డ్రైవర్‌ను పోలీసుల అదుపులో తీసుకున్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అమరావతితో పెట్టుకుని ఓడిపోయాం: జోగి రమేష్



హైదరాబాద్ పెన్ పవర్:ఏపీ రాజధాని అమరావతి మహిళలపై వైసీపీ అధినేత జగన్‌కు చెందిన సాక్షి మీడియాలో వచ్చిన చర్చ.. తీవ్ర వ్యాఖ్యలు వంటివి.. రాజకీయ దుమారం రేపాయి. పార్టీలకు అతీతంగా అందరూ ఈ విషయాన్ని ఖండిస్తున్నారు. అయితే.. వైసీపీ నుంచి మాత్రం ఇప్పటి వరకు ఎవరూ నేరుగా స్పందించలేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఫైర్ బ్రాండ్ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ రియాక్ట్ అయ్యారు. అమరావతితో పెట్టుకునే తాము గత ఎన్నికల్లో ఓడిపోయామని సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఇప్పుడు కూడా.. అమరావతి జోలికి పోవడం సరికాదన్నట్టుగా జోగి వ్యాఖ్యానించారు. %--%గతంలో ఒక పొరపాటు జరిగింది. ఇప్పుడు దానిని కొనసాగించడం సరికాదు. ఇది అందరికీ వర్తిస్తుంది%--% అని జోగి వ్యాఖ్యానించారు. మహిళలకు జగన్ ఎప్పుడూ వ్యతిరేకం కాదన్న ఆయన.. ఇళ్ల పట్టాల నుంచి పథకాల వరకు కూడా.. అన్నీ మహిళల పేరుతోనే జగన్ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేబినెట్లో కూడా.. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు.ఇక, మూడు రాజధానుల విషయంపైనా స్పందించిన జోగి.. తాము ప్రజలకు వివరించి చెప్పడంలో విఫలమయ్యామన్నారు. గతంలో జగన్ చేస్తానని ప్రకటించిన.. కార్యక్రమాన్నే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నా రని చెప్పారు. %--%మేం రాజధానులు అన్నాం. మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నది మా ఉద్దేశం. ఇప్పుడు అదే కదాచంద్రబాబు చేస్తున్నది%--% అని వ్యాఖ్యానించారు. కర్నూలులో హైకోర్టు పెడతామని చెప్పామని.. కానీ.. ఇప్పుడు బాబు బెంచ్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధాని చేయాలన్నది జగన్ సంకల్పమని.. అందుకే.. దానిని రాజధానిగా ప్రకటించారని చెప్పారు. కానీ.. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే పనిచేస్తున్నారని.. ఐటీ ని విశాఖకు కీలకంగా మార్చడం లేదా? అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి అలానే ఉంటుందని నాడు జగన్ చెప్పారని.. రైతులను ఒప్పించడంలో తాము విఫలమయ్యాయమని జోగి వ్యాఖ్యానించారు. గతంలో అమరావతితో పెట్టుకునే తాము ఓడిపోయామని పదే పదే చెప్పడం గమనార్హం.

## అమరావతి మహిళలను దూషించడంపై ఎంఎస్‌కే ప్రసాద్ స్పందన

హైదరాబాద్ పెన్ పవర్:అమరావతి ప్రాంత మహిళల గురించి, అమరావతి రాజధాని గురించి సాక్షి టీవీ చర్చా కార్యక్రమంలో ఓ పాత్రికేయుడు చేసిన అశ్లీల, అసభ్యకర వ్యాఖ్యలపై భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్, మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ (మన్నవ శ్రీకాంత్ ప్రసాద్ ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక టీవీ చర్చా కార్యక్రమంలో అమరావతిపైనా, అక్కడి మహిళలపైనా కొందరు అనుచితంగా మాట్లాడటం తనను తీవ్రంగా బాధించిందని ఎంఎస్‌కే ప్రసాద్ తెలిపారు. తాను కూడా అమరావతి గడ్డపైనే పుట్టి పెరిగానని, తన జీవితమంతా ఈ ప్రాంతంతోనే ముడిపడి ఉందని గుర్తుచేశారు. “మా తల్లి, చెల్లెళ్లు, అక్కలు, పిన్నమ్మలు, అత్తయ్యలు అందరూ ఇక్కడే, అమరావతి ప్రాంతంలోనే ఉన్నారు. ప్రతి పండగకూ అమరలింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకోవడం మాకు ఆనవాయతీ” అని ఈ ప్రాంతంతో తన అనుబంధాన్ని వివరించారు.

# సంచలనం... బెంగళూరు తొక్కిసలాటకు ముందు పోలీసుల లేఖలో ఏముంది?



హైదరాబాద్ పెన్ పవర్:రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతిచెందగా సుమారు 50 మంది గాయపడిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సమయంలో ఓ సీనియర్ పోలీస్ అధికారి ముందే హెచ్చరిస్తూ లేఖలు రాశారనే విషయం వైరల్ గా మారింది.

అవును... ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరు చినస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఓ సినియర్ అధికారి ఈ పరిస్థితులను ముందే ఊహించి హెచ్చరిస్తూ పలువురు ప్రభుత్వాధికారులకు లేఖలు రాశారనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ ఘటనలో ఇప్పటికే పలువురు పోలీసులు చిక్కుల్లో ఉన్న వేళ.. ఈ విషయం కీలకంగా మారింది.ఇందులో భాగంగా... ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమానికి ముందే పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ రిఫామ్స్ కార్యదర్శి సత్యవతితో సహా పలువురు ఉన్నతాధికారులకు, కర్ణాటక అసెంబ్లీ భద్రతను చూస్తే డీసీపీ ఎంఎన్ కరిబసవన గౌడ ఓ లేఖను రాసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆ లేఖలో లక్షలాది మంది అభిమానులు వచ్చే విషయాన్ని ముందే అంచనా వేసి, వారిని నియంత్రించడం కష్టమని, సిబ్బంది కొరత ఉందని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.“ఆ క్రికెట్ జట్టుకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో విధానసౌధలో కార్యక్రమం నిర్వహిస్తే.. లక్షలాది మంది అభిమానులు వచ్చే అవకాశం ఉంది. సిబ్బంది కొరత కారణంగా లక్షలాది మంది అభిమానులను నియంత్రించడం కష్టం” అని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం! ఇదే సమయంలో... స్టేడియంలోకి వచ్చేందుకు జారీ చేసిన ఆన్ లైన్, ఆఫ్ లైన్ ఎంట్రీ పాస్ లను నిలిపివేయాలని కోరినట్లు చెబుతున్నారు!

ఇదే సమయంలో... ఈ భారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి తగినంత సన్నాహక సమయం అవసరం అయినప్పటికీ.. బయట నుంచి అదనపు పోలీసు సిబ్బంది అవసరమని కరిబసవన గౌడ నొక్కి చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో.. ఇంత పెద్ద ఎత్తున జరిగే కార్యక్రమానికి లా %&% ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలతో సమన్వయం చాలా అవసరమని.. అందుకు ప్రస్తుతం ఉన్న సమయ వ్యవధి సరిపోదని ఆయన తెలిపినట్లు చెబుతున్నారు.

అదేవిధంగా... ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు జరగనున్న నేపథ్యంలో.. సచివాలయ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులను వేదిక వద్దకు తీసుకువచ్చే అవకాశం ఎక్కువగా ఉందని.. అందువల్ల వారి కుటుంబాలను తీసుకురావడాన్ని నిషేధించడంతో పాటు ఆ తేదీన సచివాలయ స్టాఫ్ కు మధ్యాహ్నం సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది.కాగా... బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటన పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని ఆరోపిస్తూ.. సిటీ పోలీస్ కమిషనర్ దయానంద్, ఇంటెలిజెన్స్ చీఫ్ హేమంత్ నింబాల్కర్ సహా పలువురు కీలక పోలీసు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొన్న సంగతి తెలిసిందే! ఇదే సమయంలో.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి గోవిందరాజన్ పైనా సస్పెన్షన్ వేటు వేశారు.

# కేవలం 2.5 ఏళ్లలో తెలంగాణలో 2 ఎయిర్ పోర్టులు?



హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో పోలిస్తే ఏపీలో పెద్ద ఎత్తున ఎయిర్ పోర్టుల కనిపిస్తాయి. అయితే.. ఏపీ విమానాశ్రయాలు మొత్తం రద్దీని కలిపినా.. తెలంగాణలోని శంషాబాద్ ఎయిర్ పోర్టు రద్దీలో 20 శాతం కూడా ఉండదు. అయితే.. తెలంగాణలో హైదరాబాద్ శివారున ఉండే శంషాబాద్ ఎయిర్ పోర్టు తప్పించి.. మరే విమానాశ్రయం లేకపోవటం ఒక కొరతగా చెప్పొచ్చు. ఇప్పుడు ఆ లోటును తీర్చేలా కేంద్రం.. రాష్ట్రం ఒక ప్లాన్ వడివడిగా వేస్తోంది. 2027 చివరి నాటికి తెలంగాణలో రెండు కొత్త ఎయిర్ పోర్టుల్ని అందుబాటులోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇందులో ఒకటి వరంగల్ శివారులోని మామునూరులో ఉన్న నిజాం కాలం నాటి ఎయిర్ స్ట్రిప్ కాగా.. రెండోది ఆదిలాబాద్ పట్టణ శివారులోని శాంతినగర్ లో ఉన్న ఇండియన్ ఎయిర్ పోర్స్ ఆధ్వర్యంలోని హెలిపోర్టుల స్థానంలో కొత్త ఎయిర్ పోర్టును నిర్మించాలని భావిస్తున్నారు.

ఈ రెండు కొత్త ఎయిర్ పోర్టులకు సంబంధించిన టెండర్లను ఈ ఏడాది చివరికి పిలిచి.. నిర్మాణాన్ని చేపట్టేందుకు వీలుగా చర్యలు షురూ అయ్యాయి. దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఉండే వరంగల్ ఎయిర్ పోర్టును ఏఏఐ (ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) సొంతంగా నిర్మిస్తుంటే.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు విషయంలో మాత్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఎయిర్ పోర్టులను ఆధునిక విమానాశ్రయాలుగా నిర్మించనున్నారు.

మామూలుగా అయితే.. కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించే సమయంలో తొలుత చిన్న విమానాలు దిగేలా.. తర్వాతి రోజుల్లో దాన్ని విస్తరించేలా చేస్తారు. అయితే.. అందుకుభిన్నంగా ఒకేసారి పెద్ద ఎయిర్ పోర్టులను నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ప్రతిపాదనకు ఏఏఐ కూడా ఓకే చెప్పింది. అంతేకాదు.. రాత్రివేళలోనూ విమానాలు వచ్చి వెళ్లే వసలుతు ఉండాలన్న సీఎం అభిలాషకు కేంద్రం సానుకూల స్పందన వ్యక్తం చేసింది.బోయింగ్ 737, ఎయిర్ బస్ 320 లాంటి పెద్దవిమానాలు వచ్చి పోయేందుకు వీలుగా దాదాపు 3 వేల మీటర్ల పొడవైన రన్ వేలను నిర్మిస్తారు.నైట్ ల్యాండింగ్ కు.. టేకాఫ్ కు వీలుగా ఆధునిక మెకానిజం ఏర్పాటు చేస్తారు. వరంగల్ విమానాశ్రయాన్ని వెయ్యి ఎకరాల్లో.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును 600 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఇందుకు రూ.500 – 600 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 500 మంది ప్రయాణించేందుకు వీలుగా వీటిని నిర్మిస్తున్నారు. మూడేళ్ల పాటు వయబిలిటీ గ్యాప్ ఫండ్ ను కేంద్రం అందిస్తుంది. ఎయిర్ పోర్టు నిర్వహణ వ్యయంలో కేంద్రం 80 శాతం.. రాష్ట్రం 20 శాతం భరిస్తాయి.వరంగల్ లోని పాత ఎయిర్ స్ట్రిప్ నకు సంబంధించి 696.1 ఎకరాలు అందుబాటులో ఉండగా.. మరో 280 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో సమీపంలోని రెండు ఊళ్లను ఖాళీ చేయించి.. ఆ భూమిని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధుల్ని విడుదల చేసింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు కోసం ప్రస్తుతం 369 ఎకరాలు అందుబాటులో ఉండగా.. మరో 250 ఎకరాల్ని సేకరించి ఎయిర్ పోర్టు నిర్మిస్తారు. ఈ రెండు ఎయిర్ పోర్టులను 24 నెలల్లో పూర్తి అవుతాయని ఏఏఐ చెబుతుండగా.. 18 నెలల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ కోరుతున్నారు. ఏమైనా.. 2027 చివరకు తెలంగాణలో రెండు కొత్త ఎయిర్ పోర్టులు అందుబాటులోకి వస్తాయని మాత్రం చెప్పక తప్పదు.

## మంత్రి వర్గ విస్తరణలో కాంగ్రెస్ సోషల్ఇంజనీరింగ్ ఫార్ములా




**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి వర్గ విస్తరణలో కాంగ్రెస్ సోషల్ ఇంజనీరింగ్ ఫార్ములాను అనుసరించింది. కొత్తగా ముగ్గురిని మంత్రివర్గంలో స్థానం కల్పించారు. ఎస్సీ మాల.. ఎస్సీ మాదిగ.. బీసీ ముదిరాజ్ కమ్యూనిటీల నుంచి ఒక్కొక్కరికి చాన్స్ ఇచ్చారు. కాంగ్రెస్ నుంచి 15 మంది ఎస్సీ ఎమ్మెల్యేలు విజయం సాధించగా .. కొత్తగా అవకాశంఇచ్చిన వారితో కలుపుకొని నలుగురు ఉన్నారు. ఇప్పటికే మాల కమ్యూనిటీ నుంచి భట్టి విక్రమార్క.. మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర రాజ నరసింహ ఉండగా కొత్తగా వివేక్ వెంకటస్వామి ( మాల) అడ్లూరి లక్ష్మణ్ కు అవకాశం కల్పించారు.
కాంగ్రెస్ పార్టీ నుంచి ఏడుగురు బీసీ ఎమ్మెల్యేలు గెలవగా ప్రస్తుతం ఇద్దరు బీసీ మంత్రులుగా ఉన్నారు. కొత్తగా ముదిరాజ్ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి కొత్తగా మంత్రి వర్గంలో చోటు కల్పించారు. దీంతో తెలంగాణ మంత్రి వర్గంలో బీసీ కమ్యూనిటీకి చెందిన వారు ముగ్గురు మంత్రులు అవుతారు.ఎస్టీ విషయానికొస్తే ఇప్పటి ఆదివాసీల సామాజిక వర్గానికి చెందిన సీతక్క మంత్రిగా కొనసాగుతున్నారు. లంబాడీలకు అవకాశం కల్పించకపోవడంతో.. వారిని సంతృప్తి పరిచే విధంగా రామచంద్రునాయక్? కు డిప్యూటీ స్పీకర్? గా అవకాశం ఇవ్వబోతున్నారు. కొత్తగా మంత్రిగా విస్తరణలో రెడ్డి కమ్యూనిటికి ఛాన్స్? ఇవ్వలేదు. ఇప్పటికే ఆ సామాజిక వర్గం నుంచి ముగ్గురు మంత్రులుగా ఉన్నారు.

## 15 ఏళ్ల పొలిటికల్ జర్నీ తర్వాత మంత్రి పదవి.. ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తా: వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:**15 ఏళ్ల పొలిటికల్ జర్నీ తర్వాత తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. మంత్రి పదవి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తనకు ఫోన్ చేసి చెప్పారన్నారు. ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తానని చెప్పారు. తెలంగాణ సాధనలో ఎంతో కీలక పాత్ర పోషించానని చెప్పారు. కాకాస్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానన చెప్పారు. బీఆర్ఎస్ నిరంకుశ పాలనపై ఎంతో పోరాడానన్నారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలకు చోటు దక్కుతుందన్నారు వివేక్.
కాకా అడుగు జాడల్లోనే పేద ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు వివేక్. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో నిర్బంధాలు అనుభవించానన్నారు. ఉద్యమ సమయంలో తన వ్యాపారాలను దెబ్బకొట్టాలని చూశారని చెప్పారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజా సేవ కొనసాగించానన్నారు వివేక్. జూన్ 8న మధ్యాహ్నం 12:19 గంటలకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వీళ్లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. వీళ్లతో పాటు డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రు నాయక్ ప్రమాణం చేయనున్నారు.

# చికెన్ ఉత్పత్తిలో మహారాష్ట్ర ముందు.. తెలుగు రాష్ట్రాలు ఎక్కడ?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో మాంసాహార వినియోగం అంతకంతకూ ఎక్కువ అవుతున్న సంగతి తెలిసిందే. వినియోగం సరే ఉత్పత్తి మాటేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం వెతికితే.. ఆసక్తికర అంశాలు వెల్లడవుతాయి. దేశంలో అత్యధిక చికెన్ ఉత్పత్తి చేసే రాష్ట్రంగామహారాష్ట్ర నిలిచింది. 2023-24లో దేశ వ్యాప్తంగా 50.19 లక్షల టన్నులు (టన్ను అంటే వెయ్యి కేజీలు) చికెన్ ఉత్పత్తి అయినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో మహారాష్ట్ర వాటా 7.56 లక్షల టన్నులతో మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో పశ్చిమ బెంగాల్ (6.75 లక్షల టన్నులు).. మూడో స్థానంలో హర్యానా (6.36 లక్షల టన్నులు).. నాలుగో స్థానంలో తమిళనాడు (5.58 లక్షల టన్నులు).. ఐదో స్థానంలో తెలంగాణ (5.10 లక్షల టన్నుల) నిలిచాయి. రాజస్థాన్.. జార?ండ్.. మధ్యప్రదేశ్.. గుజరాత్.. హిమాచల్ ప్రదేశ్ లో చికెన్ వినియోగం అతి తక్కువగా ఉందన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా ఎన్ వీ స్టాట్స్ ఇండియా 2025 పేరుతో విడుదలైన గణాంకాల్ని చూస్తే.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. 2023-24లో చికెన్.. మటన్ తో కలిపి అన్ని రకాల మాంసాల ఉత్పత్తి చూస్తే 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తి జరిగినట్లుగా పేర్కొన్నారు. మొత్తం మాంసాహారం ఉత్పత్తిలో ఏపీ కంటే తెలంగాణ ముందుంది. తెలంగాణలో మొత్తం 11.12 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి జరగ్గా.. ఆంధ్రప్రదేశ్ లో 10.67 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. దేశ వ్యాప్తంగా 1.84 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరగ్గా.. 51.58 లక్షలటన్నులతో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2015-16లో ఏపీలో చేపల ఉత్పత్తి 23.52 లక్షల టన్నులు మాత్రమే కాగా.. ప్రస్తుతం ఇది రెట్టింపు అయినట్లుగా చెప్పాలి. తెలంగాణలో కేవలం 4.56 లక్షల టన్నులచేపలు మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. గతంతో పోలిస్తే సాగుభూమి స్వల్పంగా పెరగటం. 2019-20లో మొత్తం 21.13 కోట్ల హెక్టార్లలో పంటలు పండగా.. 2022623 నాటికి స్వల్పంగా పెరిగి 21.93కోట్ల హెక్టార్లకు పెరిగినట్లుగా నివేదిక వెల్లడించింది.

## తలపై పెట్రోల్ పోసుకుని నిరసన... మణిపూర్ లో మళ్లీ ఎందుకీ ఉద్రిక్తతలు?



**హైదరాబాద్ పెన్ పవర్:**గతంలో తీవ్ర సంచలనంగా మారిన మణిపూర్ వ్యవహారం సంగతి తెలిసిందే. కుకీ, మైటీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలతో మణిపూర్ ఒక్కసారిగా తీవ్ర చర్చనీయాంశంగా మారిపోయింది. అయితే తర్వాత గత కొంతకాలంగా కాస్త నిశబ్ధంగానే ఉన్నట్లు కనిపించిన ఆ ప్రాంతంలో మరోసారి హైటెన్షన్ వాతావారణం మొదలైంది. దానికి కారణం ఏటీ కీలక సభ్యుడిని అరెస్ట్ చేయడం అని అంటున్నారు.అవును... మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ లో మరోసారి హైటెన్షన్ వాతావారణం నెలకోంది. శనివారం రాత్రి అరంబై టెంగోల్ (ఏటీ) కీలక నాయకుడిని అరెస్ట్ చేయడంతో మళ్లీ ఉద్రిక్తతలు ఒక్కసారిగా లేచాయి. ఈ సమయంలో ఏటీ నాయకుడు ననన్ సింగ్ అరెస్టుకు వ్యతిరేకంగా యువకులు, మైటీ స్వచ్ఛంద సేవకులు నిరసనలకు దిగారు. దీంతో శనివారం రాత్రి 11:45 గంటల తర్వాత నుంచి ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, తౌబాల్, కాక్చింగ్, బిష్ణుపూర్ అనే ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు. ఈ నిలిపివేత ఐదు రోజుల పాటు ఉంటుందని అధికారులు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ద్వేషపూరిత సందేశాలు, రెచ్చగొట్టే చిత్రాలు, వీడియోలను పోస్ట్ చేస్తారనే ఉద్దేశ్యంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు.
ఇలా శనివారం రాత్రి భద్రత దళాలు ఏటీ నాయకుడిని అదుపులోకి తీసుకున్న అనంతరం నిరసనలు పెద్ద ఎత్తున చెలరేగాయి. ఈ సమయంలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి టైర్లను, పాత సామానులను తగులబెట్టి రోడ్లను దిగ్బంధించారు. నిరసన దృశ్యాల్లో... నల్లటి టీషర్టులు ధరించిన యువకుల గుంపు పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని, అందులోని పెట్రోల్ తలపై పోసుకోవడం కనిపించింది.ఈ సందర్భంగా... మేము ఆయుధాలు వదులుకున్నాము.. వరదల సమయంలో మీరు చేయాల్సిన పనిని తామే చేశాము.. ఇప్పుడు మీరు తిరిగి మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారు.. మమ్మల్ని మేమే చంపుకుంటాము అని చెబుతూ వారి వారి తలలపై పెట్రోల్ పోసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.ఈ సందర్భంగా స్పందించిన ఏటీ... 2023 మే నెలలో జాతి హింస ప్రారంభ రోజుల్లో చట్టం అమలులో అసమర్థత కారణంగా గ్రామ వాలంటీర్లుగా ఆయుధాలు చేపట్టవలసి రావడంతో ఏర్పడిన సంస్థ ఇది అని తెలిపింది. చట్టం అమలు సరిగ్గా లేకపోవడంతో మైటీ గ్రామాలు.. కుకీ మిలిటెంట్ల దాడులకు గురయ్యాయని చెబుతోంది.కాగా గత పది సంవత్సరాలుగా మణిపూర్ లో దాదాపు అంతరించిపోయిన పీపుల్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ), కాంగ్లీ యవల్ కన్న లూప్ (కేవైకేఎల్), కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (కేసీపీ) వంటి నిషేధిత మైటీ మిలిటెంట్ గ్రూపులు కూడా మే 2023 తర్వాత మయన్మార్ నుంచి తిరిగి వచ్చాయని.. సైనిక దళాల పట్టు తగ్గడం వల్ల కూడా ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు.

## స్కూబా డైవింగ్ చేస్తూ .. దుబాయ్‌లో భారత ఇంజినీర్ మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:**పండగ సందర్భంగా దుబాయ్ జుమేరా బీచ్ కు వెకేషన్ కు వెళ్లారు. ఫ్యామిలీ అంతా సరదాగా గడిపారు. ఆ క్రమంలో అక్కడ ఫేమస్ అయిన స్కూబా డైవింగ్ చేయాలని ప్రయత్నించి భారత ఇంజినీర్ మృతి చెందడం ఆ ఫ్యామిలీలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

వివరాల్లోకి వెళ్తే.. కేరళకు చెందిన ఇంజినీర్ ఐజాక్ పాల్ ఒలక్కెంగిల్ (29) యూఏఈలో ఇంజినీర్ గా వర్క్ చేస్తున్నాడు. ఈద్-అల-అధా పండుగ సందర్భంగా కుటుంబంతో కలిసి సెలెబ్రేట్ చేసుకునేందుకు బీచ్ వెళ్లారు. స్కూబా డైవింగ్ చేస్తున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్ అవ్వడంతో చనిపోయాడు.

స్కూబా డైవింగ్ ట్రైనింగ్ సెషన్ లో ఈ ప్రమాదం జరిగినట్లు ఐజాక్ బంధువు చెప్పారు. బిగినర్స్ ట్రైనింగ్ సెషన్ లో ఐజాగ్ పాల్గొన్నాడని.. అందరూ ట్రైనింగ్ పార్టిసిపేషన్ లో ఉండగా గుండె పట్టేసిందని తెలిపారు. వెంటనే ట్రైనింగ్ గ్రూప్ నుంచి బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించినా లాభం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐజాక్ మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు అధికారులతో మాట్లాడుతున్నట్లు ఐజాక్ బంధువు ప్యరిలోస్ తెలిపారు. స్కూబా డైవింగ్ అంటే ప్రపంచ వ్యాప్తంగా ఫేమస్ క్రీడ. బీచ్ లలో దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. సముద్ర అంతర్భాగంలోకి వెళ్లి నీళ్లలో ఉండే వివిధ రకాల జంతుజాతులను చూడవచ్చు. సముద్ర అంతర్భాగం గురించి ప్రత్యక్షంగా చూసి అనుభూతి పొందవచ్చు. అందుకోసమే చాలా మంది ప్రత్యేకంగా స్కూబా డైవింగ్ చేస్తుంటారు. ఐజాక్ కూడా అలాగే తన అభిరుచిని తీర్చుకోవాలని అనుకున్నాడు. కానీ.. మృత్యువు అతని ఆనందాన్ని ఎక్కువసేపు మిగల్చలేదు.

## చేతికి ఐవీ ఎక్కించుకుని కారులో యువ వైద్యుడి ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:**తమిళనాడులోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొడైకెనాల్ సమీపంలో ఒక యువ వైద్యుడు తన కారులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని డాక్టర్ జోషువా సామ్రాజ్‌గా గుర్తించారు. ఆయన సేలంలో ఎండీ చదువుతూ, మధురైలోని ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు సమాచారం. కొడైకెనాల్‌కు దగ్గరలోని పూంపరై అనే అటవీ ప్రాంతంలో ఒక కారు మూడు రోజులుగా నిలిచి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును పరిశీలించగా, లోపల డాక్టర్ జోషువా మృతదేహం లభ్యమైంది. ఆయన స్వయంగా ఇంట్రావీనస్ (ఐవీ) ద్రావణాలు ఎక్కించుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కారులో ఒక సూసైడ్ నోట్‌ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో డాక్టర్ జోషువా తన కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెప్పారని, అయితే తన చావుకు ఎవరినీ నిందించలేదని, ఎందుకు చనిపోతున్నదీ వెల్లడించలేదని పోలీసులు తెలిపారు. "ఆయన ఒక ప్రేమ వ్యవహారంలో సమస్యల కారణంగా తీవ్ర ఆవేదనతో ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు" అని పోలీసులు పేర్కొన్నారు. డాక్టర్ జోషువా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు కూడా దర్యాప్తులో వెల్లడైంది, అయితే ఆ అప్పులకు కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడం వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాపించాయి. దీనిపై పోలీసులు స్పందిస్తూ, "సూసైడ్ నోట్‌లో అలాంటి వివరాలేవీ లేవు, ఆయన తల్లిదండ్రులు కూడా ఆ విషయం చెప్పలేదు. మేము అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నాం," అని స్పష్టం చేశారు.

# షాహిద్ అఫ్రీదీ అహంకారం ఇది... భారత్ పై తప్పుడు మాటలు!

**హైదరాబాద్ పెన్ పవర్:**కొంతమందికి వాస్తవాలు తెలిసినా, తనకు తెలిసిన వాస్తవాలు ప్రపంచమంతటికీ తెలుసని తెలిసినా కూడా నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అన్నచందంగా వ్యవహార శైలిని కలిగి ఉంటారు. ఈ విషయంలో ఫస్ట్ ప్లేస్ కోసం ప్రయత్నించే పాకిస్థానీయుల్లో షాహిద్ అఫ్రీదీ ఒకరు! ఈ క్రమంలో తాజాగా మరోసారి భారత్ పై అహంకారపూరిత వ్యాఖ్యలు చేశాడు.



అవును... భారత్ పై అవాకులూ చెవాకులూ పేలుతుంటాడు అఫ్రీది. అనంతరం ఇటు వైపు నుంచి చెంపలు వాచే కౌంటర్లు పడిన అనంతరం కామ్ అయిపోతుంటాడు. ఈ క్రమంలో తాజాగా మరోసారి భారత్ పై విషం కక్కాడు. ఇందులో భాగంగా.. క్రికెట్ లో అయినా, ధైర్యంలో అయినా, టెక్నాలజీలో అయినా పాక్ కంటే భారత్ పదేళ్లు వెనక్కే ఉందంటూ వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగని అఫ్రీది అహంకారం, అజ్ఞానం... అసలు భారత్ ని తమ ప్రత్యర్థి అని పిలవడానికి కూడా అవమానంగా ఉంది అని వ్యాఖ్యానిచేవరకూ వెళ్లింది. దీంతో... ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి పూర్తిగా అన్నీ వదిలేయాలని.. అంతటి అజ్ఞానం అఫ్రీది సొంతమని చెబుతున్నారు! వాస్తవానికి అఫ్రీదీ చేసిన వ్యాఖ్యలు రివర్స్ లో కరెక్ట్ అని చెప్పాలి. యుద్ధం అయినా, క్రికెట్ అయినా, టెక్నాలజీ అయినా, అభివృద్ధి అయినా.. దేనిలోనూ భారత్ కు కనీసం దరిదాపుల్లో కూడా పాకిస్థాన్ లేదనే విషయం ఇరు దేశాలతో పాటు ప్రపంచానికీ తెలిసిన నగ్న సత్యం! ఆ విషయం అఫ్రీదీకి తెలియంది కాదు! ఒకప్పుడు హై ఓల్టేజ్ గా నడిచిన భారత్ - పాక్ క్రికెట్ మ్యాచ్ ల విషయానికొస్తే... అవన్నీ ఇప్పుడు వార్ వన్ సైడ్ మ్యాచ్ లు గా మారిపోయాయి. మైదానంలో పాక్ ను చిత్తు చిత్తుగా కొట్టేస్తోంది టీమిండియా. ఇక ఇటీవల జరిగిన ఛాంపియన్ ట్రోఫీలో పాక్ ఫెర్మార్మెన్స్, భారత్ ధమ్మా ఇందుకు తాజా ఉదాహరణ. ఈ విషయం మాజీ క్రికెటర్ అయిన అఫ్రీదీకి తెలియంది కాదు! ఇక ధైర్యం విషయానికొస్తే... ఇటీవల పహల్గాం పిరికి ఉగ్రదాడి అనంతరం భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ సమయంలో ఉగ్ర శిబిరాలతో పాటు పాక్ సైనిక స్థావరాలను నేలమట్టం చేసింది. దీంతో.. అటు ఉగ్రవాదులు, ఇటు పాక్ సైన్యం వణికిపోయాయి. ఫలితంగా... ప్రపంచ దేశాల ముందు సాష్టాంగ పడి భారత్ తో సీజ్ ఫైర్ కు మధ్యవర్తిత్వం చేయమని బ్రతిమాలుకుంది పాక్. భారతదేశపు ధైర్యం విషయంలో షాహిద్ అఫ్రీదికి ఇంతకు మించిన తాజా ఉదాహరణ ఇంకేమైనా కావాలంటే... పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ని అడిగితే మరింత స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది! ఇక.. టెక్నాలజీ విషయానికొస్తే.. దీనికి చాలా ఉదాహరణలే ఉన్నప్పటికీ.. ఆపరేషన్ సిందూర్ లో బ్రహ్మోస్ క్షిపణి మిగిల్చిన జ్ఞాపకాలను అఫ్రీదీ ఒకసారి చూస్తే సరిపోతుంది! ఒక్కమాటలో చెప్పాలంటే... భారత్ చంద్రునిపైకి రాకెట్లు పంపుతుంది, ప్రపంచ ఐటీకి నాయకత్వం వహిస్తుంది, క్రికెట్ లోనూ ఆధిపత్యం చెలాయిస్తుంది.. మరి పాకిస్థాన్ సొంత దేశంలో క్రికెట్ మ్యాచ్ లు ధైర్యంగా నడపలేని స్థితిలో ఉంది.. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఐఎంఎఫ్ ముందు అప్పుల కోసం వేడుకుంటుంది.. ఈ విషయాలు అఫ్రీదికి తెలియకపోవచ్చు!

# గొట్టాలతోనే గూఢచర్యం ...వీరితో జాగ్రత్తగా ఉండాల్సిందేనా మరి

**హైదరాబాద్ పెన్ పవర్:**కరోనా వైరస్ కేసులు భారత్ లో పెరుగుతున్నాయి. ప్రతి రోజూ కేసుల సంఖ్య పెరుగుతున్నాయి. రోజుకు యాక్టివ్ కేసుల సంఖ్య ట్రిపుల్ అవుతున్నాయి. నిన్న మూడు వందలకు పైగా కేసులు నమోదయితే ఈరోజు వెయ్యికి పైగానే కేసులు నమోదవుతున్నాయి. దీంతో కరోనా వ్యాప్తి ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందో ఇట్టే అర్థమవుతుంది. చలిగాలులు ప్రవేశించడంతో పాటు నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు పడటంతో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, బయటకు వెళ్లివచ్చినప్పుడు శానిటైజర్ తో చేతులు శుభ్రపర్చుకోవాలని, లేకుంటే వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుందని వైద్యులు తెలిపారు.

**కొత్తగా ఇరవై నాలుగు గంటల్లో...**

ఈరోజు దేశంలో 378 కొత్త గా కరోనా పాజిటివ్ కేసులు నమోదయినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో భారత్ లో కరోనా వైరస్ యాక్టివ్ కేసుల సంఖ్య 6,133 కు చేరింది. గత ఇరవై నాలుగు గంటల్లో కరోనా వైరస్ కారణంగా ఆరుగురు మరణించడం కూడా ఆందోళనకు దారి తీసింది. ఇప్పటి వరకూ భార్ లో కర్నో వైరస్ తో మరణించిన వారి సంఖ్య 65కు చేరింది. ఈ ఏడాది జనవరి నుంచి కరోనా వైరస్ భారత్ లో ప్రారంభమయినప్పటికీ మే 25వ తేదీ నుంచి వేగంగా వ్యాప్తి చెందుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. కేవలం ప్రభుత్వాలు మాత్రమే కాదు ప్రజలు కూడా కర్నో వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**యాక్టివ్ కేసులు ఎక్కువగా...**

ప్రధానంగా దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు సామూహికంగా ప్రజలు గుమిగూడే ప్రాంతాలకు వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లినా మాస్క్‌లను మస్ట్ గా ధరించాలని, లేకుంటే వైరస్ సులువుగా సోకుతుందని చెప్పారు. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారికి ఎక్కువగా వైరస్ సోకుతుందని కూడా వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళలో అత్యధికంగా 1,950 కరోనా వైరస్ యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా కరోనా కేసుల సంఖ్య ఎక్కువగా పెరుగుతుందని, ప్రభుత్వాలు కూడా ప్రజల్లో అవగాహన పెంచాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

## రైతులకు గుడ్ న్యూస్.. ఈ నెలలో "అన్నదాత సుఖీభవ" నగదు జమ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పేసింది. ఈ నెలలోనే 'అన్నదాతా సుఖీభవ' డబ్బు జమ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద ఉన్న వారందరికీ ఈ పథకం వర్తించే అవకాశముంది. అదే సమయంలో కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయనున్నారు.

**పీఎం కిసాన్ నిధులతో పాటే...**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులకు 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. జూన్ 20వ తేదీన పీఎం కిసాన్ డబ్బు రెండు వేల రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా ఐదు వేల రూపాయలు కలిపి ఏడు వేల రూపాయలు జమ చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం కసరత్తులు కూడా ప్రారంభించింది. అక్టోబర్ లో రెండో విడత, వచ్చే జనవరిలో మూడో విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు ను జమ చేయనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**అర్హులని నియమించి...**

ఇందుకు అవసరమైన నిధులను కూడా సమీకరించి పెట్టుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు లబ్ధిదారుల జాబితాతో పాటు అవసరమైన నిధులను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇంకా పదమూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా అన్నదాత పథకం కింద తొలి విడత ఏడు వేల రూపాయలు జమ చేయనున్నారు. పీఎం కిసాన్ డబ్బు జమ తేదీ మారితే అనుగుణంగా ఈ డేట్ కూడా మారే అవకాశముందని చెబుతున్నారు. ఈ పథకానికి 45.71 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించినట్లు తెలిసింది. మొత్తం మీద అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20వ తేదీన జమ చేయనున్నారు.

## ఫేక్ సర్టిఫికెట్‌తో 50కి పైగా గుండె ఆపరేషన్లు చేసిన ఎంబీబీఎస్ డాక్టర్!

**హైదరాబాద్ పెన్ పవర్:** హర్యానాలోని ఫరీదాబాద్‌లో వైద్యరంగంలోనే అత్యంత దారుణమైన మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. కేవలం ఎంబీబీఎస్ డిగ్రీ మాత్రమే ఉన్న ఒక వైద్యుడు ఏకంగా కార్డియాలజిస్ట్‌గా నటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో 50కి పైగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఫరీదాబాద్‌లోని బాద్‌షా ఖాన్ సివిల్ ఆసుపత్రిలో డాక్టర్ పంకజ్ మోహన్ శర్మ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడు. సుమారు ఎనిమిది నెలలకు పైగా కార్డియాలజిస్ట్‌గా చలామణి అవుతూ గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించాడు. వాస్తవానికి అతడికి ఎంబీబీఎస్ పట్టా మాత్రమే ఉంది. గుండె వంటి కీలకమైన అవయవాలకు సంబంధించిన సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి అతనికి ఎలాంటి అధికారిక అర్హత లేదని పోలీసులు స్పష్టం చేశారు.

ఈ నకిలీ వైద్యుడు, ప్రస్తుతం ప్రాక్టీస్‌లో ఉన్న మరో నిజమైన కార్డియాలజిస్ట్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఈ మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. అతడితో సర్జరీ చేయించుకున్న అనేక మంది రోగులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని, వారిలో కొందరు మరణించినట్లు కూడా సమాచారం.

# ఇండోర్ నవ దంపతుల మిస్సింగ్ మిస్టరీ: ముగ్గురు వ్యక్తులతో చూశానన్న గైడ్.. కేసులో కొత్త మలుపు!



**హైదరాబాద్ పెన్ పవర్:** మేఘాలయలో హనీమూన్ కోసం వెళ్లిన ఇండోర్ జంట అదృశ్యం ఘటనలో మిస్టరీ ఇంకా కొనసాగుతూనే ఉంది. మే 23న కనిపించకుండా పోయిన ఈ దంపతుల్లో భర్త మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యం కాగా, భార్య ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించి తాజాగా వెలుగులోకి వస్తున్న వివరాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

**ముగ్గురు వ్యక్తులతో దంపతులు?**

ఈ జంట అదృశ్యమైన రోజున, వారి వెంట మరో ముగ్గురు పురుషులు ఉన్నట్లు ఒక టూరిస్ట్ గైడ్ తాజాగా వెల్లడించడం ఈ కేసులో కీలక మలుపుగా మారింది. పీటీఐ వార్తా సంస్థ కథనం ప్రకారం.. ఆల్బర్ట్ ప్డే అనే గైడ్.. రాజా రఘువంశీ, ఆయన భార్య సోనమ్‌లను మే 23న ఉదయం సుమారు 10 గంటల సమయంలో నాన్‌గ్రియాట్ నుంచి మావ్లాఖియాట్ వైపు 3,000 మెట్లకు పైగా ఎక్కుతుండగా చూశానని తెలిపారు. అంతకు ముందు రోజు తాను వారికి గైడ్‌గా సేవలందిస్తానని చెప్పగా, వారు సున్నితంగా తిరస్కరించారని ఆల్బర్ట్ గుర్తు చేసుకున్నారు. "ఆ నలుగురు పురుషులు ముందు నడుస్తుండగా, మహిళ వారి వెనుక వస్తున్నారు. ఆ నలుగురు హిందీలో మాట్లాడుకుంటున్నారు. కానీ నాకు ఖాసీ, ఇంగ్లిష్ మాత్రమే తెలుసు కాబట్టి వారేం మాట్లాడుకుంటున్నారో అర్థం కాలేదు" అని ఆల్బర్ట్ ప్డే చెప్పినట్లు పీటీఐ ఉటంకించింది. తాను మావ్లాఖియాట్ చేరుకునే సమయానికి వారి స్కూటర్ అక్కడ లేదని, ఈ విషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశానని గైడ్ పేర్కొన్నాడు. నవ దంపతులు అద్దెకు తీసుకున్న స్కూటర్ మావ్లాఖియాట్‌లోని పార్కింగ్ స్థలానికి చాలా కిలోమీటర్ల దూరంలో సోహ్రారిమ్ వద్ద తాళం చెవితో సహా వదిలేసి ఉండటం గమనార్హం. భర్త మృతదేహం లభ్యం.. హత్య అనుమానాలు రోజుల తరబడి గాలించిన అనంతరం జూన్ 2న రాజా రఘువంశీ మృతదేహాన్ని సహాయక సిబ్బంది ఒక లోయలో గుర్తించారు. అతని శరీరంపై ఉన్న బంగారు ఉంగరం, మెడలోని గొలుసు మాయమవడం హత్య జరిగి ఉండవచ్చనే అనుమానాలను మరింత బలపరుస్తోంది. ఆ మరుసటి రోజు సమీపంలోనే రక్తపు మరకలతో కూడిన ఒక కత్తిని కూడా అధికారులు కనుగొన్నారు. రెండు రోజుల తర్వాత సోహ్రారిమ్ నుంచి రాజా మృతదేహం దొరికిన లోయకు మధ్యలో ఉన్న మావ్మా గ్రామంలో దంపతులు ఉపయోగించిన రెయిన్‌కోట్ ఒకటి లభ్యమైంది. ఈ ఆధారాలన్నీ రాజా హత్యకు గురై ఉండవచ్చని సూచిస్తుండటంతో, అతని భార్య సోనమ్ కోసం గాలింపు చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పర్వతారోహకులు, జాగిలాలు, డ్రోన్లతో గాలిస్తున్నారు. అయితే, క్లిష్టమైన భూభాగం, అతి భారీ వర్షాలు, కొన్ని అడుగుల దూరం కూడా కనిపించకుండా అడ్డుకుంటున్న పొగమంచు వాతావరణం గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది.

**సీసీటీవీ ఫుటేజ్‌లో చివరి దృశ్యాలు**

దంపతుల అదృశ్యంపై దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి రెండు సీసీటీవీ ఫుటేజ్‌లు వెలుగులోకి వచ్చాయి. ఒక ఫుటేజ్‌లో దంపతులు అద్దెకు తీసుకున్న స్కూటర్‌పై వెళ్తున్నట్లు కనిపించగా, మరొకటి వారు ట్రిప్‌కు బయలుదేరే ముందు తమ వస్తువులలో కొన్నింటిని తీసుకుంటున్న గెస్ట్‌హౌస్‌లోనిది. టీ7 న్యూస్ సేకరించిన సమాచారం ప్రకారం.. మే 22న, అంటే వారు అదృశ్యం కావడానికి ఒక రోజు ముందు రాజా, సోనమ్ ఒక గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. అక్కడ గదులు అందుబాటులో లేకపోవడంతో కనీసం తమ లగేజీనైనా భద్రపరచాలని గెస్ట్‌హౌస్ సిబ్బందిని కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నాన్‌గ్రియాట్‌లోని ప్రసిద్ధ డబుల్ డెక్కర్ రూట్ బ్రిడ్జ్‌ను సందర్శించి తిరిగి వస్తామని వారు హామీ ఇవ్వడంతో హోటల్ సిబ్బంది లగేజీని తనిఖీ చేసి భద్రపరచడానికి అంగీకరించారు. వీడియోలో సోనమ్ తమ స్కూటర్‌పై రెయిన్‌కోట్ వేస్తున్నట్లు కూడా కనిపించింది.

**ప్రభుత్వంపై సోనమ్ కుటుంబం ఆరోపణలు**

షిల్లాంగ్‌లో మకాం వేసిన సోనమ్ సోదరుడు గోవింద్ రాష్ట్ర ప్రభుత్వం తమ సోదరి ఆచూకీ కనుగొనడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆమె చనిపోయిందన్నట్లుగా గాలిస్తున్నారని ఆరోపించారు. "సోనమ్ బతికే ఉందని మేము గట్టిగా నమ్ముతున్నాము. వారు మాత్రం ఆమె చనిపోయినట్లుగా వెతుకుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐ లేదా ఇతర ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఎండతో పాటు తేలికపాటి జల్లులు... ఉక్కపోత మామూలేనట

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నేడు వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ సాయంత్రం వేళకు వర్షాలు పడతాయని చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా తేలికపాటి వర్షాలు పడతాయని, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో పగటి పూట నలభై డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. అలాగే బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడావాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**వేడిగాలుల తీవ్రత...**

దీంతో పాటు వేడిగాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉండే అవకాశముందని చెప్పింది. ఉదయం, సాయంత్రం వేళ వర్షంపడినప్పుడు చల్లటి గాలులు వీచినప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఉక్కపోత, వేడిగాలులు వీస్తాయని తెలిపింది. వాతావరణం కూడా వేడితో పాటు తేమతో కూడి ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు తేలికపాటి వర్షాలు కొన్ని చోట్ల పడే అవకాశముందని వాతావరణ కేంద్రం చెప్పింది. దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాలో అక్కడక్కడ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. కొన్ని చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశముందని, మరికొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

**మరో రెండు రోజుల పాటు...**

తెలంగాణలోనూ భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, అదే సమయంలో పగటి పూట ఉష్ణోగ్రతలు నలభై నుంచి నలభై మూడు డిగ్రీలకు చేరుకునే అవకాశముందని పేర్కొంది. ప్రధానంగా రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.